క్లుప్తంగా

క్రికెట్ క్రీడాకారుడి కుటుంబానికి ఆర్థికసాయం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన క్రికెట్ సీనియర్ క్రీడాకారుడు, డీవీఎంసీసీ మాజీ కెప్టెన్ మునగలేటి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం వెంకన్న దశదిన కర్మ సందర్భంగా డీవీఎంసీసీ సభ్యులు అతని కుటుంబ సభ్యులకు రూ.24 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దున్నా సుధాకర్, దున్నా శ్రీనివాస్, చక్రవర్తి, దున్నా సురేష్, పాతకొట్ల నాగరాజు, పల్లపు నాగేశ్వరరావు, ప్రకాష్, సుధీర్, ప్రవీణ్, రవి, ఉన్నారు.

రామాలయ కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ చైర్మన్ అచ్చిరెడ్డి, సభ్యులు

చిలుకూరు : మండల కేంద్రంలోని కోదండ రామాలయ నూతన చైర్మన్ అచ్చిరెడ్డి, సభ్యులు సాగి గణేష్, బాలేబోయిన వెంకన్న, కె.సంధ్య, ఎస్.రామిరెడ్డి, ఆలయ పూజారి సిరికొండ పృథ్వీతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, ఈఓ మృత్యుంజయశాస్త్రి, గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

మునగాల : మహిళా రైతులకు 2025– 26 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 50 శాతం సబ్సిడీపై పనిముట్లు అందచేస్తుందని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగాల మండలానికి చేతితో లేదా బ్యాటరీ సహాయంతో మందు పిచికారీ చేసే పంపులు ఐదు, తైవాన్ స్ప్రేయర్లు ఐదు, రోటవేటర్లు రెండు, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్ ఒకటి, ట్రాక్టర్‌తో దున్నే పనిముట్లు (కల్టివేటర్, డిస్క్ హ్యారో, నాగలి, దమ్ముచక్రాలు మొదలైనవి)నాలుగు మంజూరైనట్లు తెలిపారు. అర్హత ఉన్న ఆసక్తి గల మహిళా రైతులు ఏఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్ ప్రతులు రెండు పాస్‌ఫొటోలు, రైతు చెల్లించాల్సిన డీడీని దరఖాస్తు పారంతో జతచేయాలని సూచించారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

నడిగూడెం : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మం కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి షేక్.సైదులు, సీనియర్ వైద్యులు తన్నీరు సత్యనారాయణ, దున్నా వీరబాబు, కందాల కృష్ణ, ప్రభాకర్, సైదులు, నాగేశ్వరరావు, గురుస్వామి, వెంకన్న, కనకరత్నం పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు నివాళి

కోదాడరూరల్ : కోదాడ పబ్లిక్ క్లబ్ శాశ్వత సభ్యుడు ముంద్రా వెంకటేశ్వరరావు (75) అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం కోదాడలో ఆయన మృతదేహాన్ని టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, క్లబ్ కార్యవర్గ సభ్యులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి వెంకటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నివాళులర్పించిన వారిలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాయం పట్టాభిరెడ్డి, బొల్లు రాంబాబు, నరసయ్య, సత్యనారాయణ, వెంకట్రావు, చంద్రశేఖర్, రామారావు, శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలకు గురి కావొద్దు

హుజూర్‌నగర్ : యువత సైబర్ మోసాలకు గురి కావొద్దని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్ ఉడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్‌పై పోలీస్ కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. హెచ్ఎం తుమ్మ మద్రెడ్డి, మారయ్య, హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ జహీరుద్దీన్, వినోద్, ఉపేందర్, హోంగార్డు విజయ్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, ఈశ్వరాచారి, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చతోరణం.. ఆహ్లాదకరం



చాకిరాల నుంచి రామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెట్లు



నడిగూడెం నుంచి బృందావనపురం వెళ్లే రోడ్డులో..

- రహదారులకు ఇరువైపులా కనువిందు చేస్తున్న పచ్చని చెట్లు
- సేద తీరుతున్న బాటసారులు
- సత్ఫలితాలిచ్చిన హరితహారం

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. హరిత హారంలో భాగంగా గత ప్రభుత్వంలో నాటిన మొక్కలు పెగిరి నేడు చెట్లుగా మారాయి. నడిగూడెం మండలంలో ఏ ఊరుకు వెళ్లినా రోడ్లకు ఇరువైపులా పచ్చని చెట్లు దర్శనమిస్తున్నాయి. వృక్షాలు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. ప్రస్తుత వేసవిలో ప్రయాణం చేసే వాహనదారులు పచ్చని చెట్ల కింద సేద తీరుతున్నారు.

బాటసారులకు నీడనిస్తూ..

2014– 15 ఏడాదిలో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాటి నుంచి ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా రహదారుల వెంట మొక్కలు నాటుతూ వస్తున్నారు. ఉపాధి సిబ్బంది మొక్కలకు రక్షణ ఏర్పాటు చేసి నీటిని అందించి రక్షించారు. నాడు నాటిన మొక్కలు నేడు బాటసారులకు నీడనిస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగిత రామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి గ్రామాల వెంట ఎటు చూసినా చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కానుగ, గుల్మోరా, చింత, సీతాఫలం, గిన్నె, నేరేడు, చీమ తంగేడు తదితర చెట్లు కనిపిస్తున్నాయి.

రహదారి ఆహ్లాదకరంగా ఉంటుంది



నడిగూడెం నుంచి బృందావనపురం గ్రామానికి వెళ్లే రహదారి వెంట ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు పెద్ద చెట్లుగా మారాయి. రెండు గ్రామాల మధ్య పచ్చని తోరణాన్ని తలపిస్తున్నాయి. బృందావనపురం గ్రామానికి వెళ్తుంటే రహదారి వెంట పచ్చని పొలాలు, పచ్చని చెట్లు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

– ఆదిమళ్ల సురేష్‌కుమార్, నడిగూడెం

కష్టపడి మొక్కలు పెంచాం



పాత చాకిరాల నుంచి రామాపురం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా నాడు నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారాయి. మొక్కలను మేకలు, పశువులు తినకుండా రక్షణగా కంప ఏర్పాటు చేసి కాపాడాం. కాల్వల నీరు, పొలాల నీటిని పోసి మొక్కలను రక్షించాం. సాగర్ కాల్వ కట్టకు కూడా 100కు పైగా మొక్కలు నాటడంతో నేడు పెద్ద వృక్షాలుగా మారాయి.

– రెడ్డి సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్, చాకిరాల

సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేవరకూ దశలవారీగా పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. ఈమేరకు సోమవారం హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సీపీఎం ప్రజా పోరుబాటలో భాగంగా ఈనెల 12 నుంచి 23 వరకు పట్టణంలో అనేక వార్డులలో పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రెయినేజీ, రహదారులు, భగీరథ పైపుల లీకేజీ, నీటి గుంతలు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటివి ఉన్నాయని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి బ్రహ్మం, వట్టేపు సైదులు, పి.హుస్సేన్, శీలం శ్రీను, సోమయ్య, వెంకటనారాయణ, యోనా, వీరమల్లు, వెంకటనారాయణ, వీరయ్య, వీరస్వామి, వీరబాబు, కిషోర్, వెంకటేష్, శంభయ్య, రమ, మమత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గరిడేపల్లి : వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విధానాలపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో సోమవారం జరిగిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతాంగం శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ సాగు చేసే విధానాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించాలని కోరారు. పంట మార్పిడి విధానాన్ని చేపట్టాలన్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. సమగ్ర వ్యవసాయ విధానాలు, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్, హెడ్ ఇన్‌చార్జ్ డి.నరేష్, శాస్త్రవేత్తలు సీహెచ్ నరేష్, ఏ.కిరణ్, బి.ఆదర్శ్, డాక్టర్ టి.మాధురి, ఎన్.సుగంధి, యాదాద్రి భువనగిరి డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్ కుమార్, నాబార్డ్ డీడీఎం ఎన్.సత్యనారాయణ, ఎస్ఏఐఆర్‌డీ బోర్డు డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఏడీఏ రవి, మండల వ్యవసాయ అధికారి ప్రీతంకుమార్, సూర్యాపేట జిల్లా ఉద్యాన అధికారి మహేష్, నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, వివేకానంద ఎన్జీఓ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎండీ గౌస్మియా, శాస్త్రీయ సలహా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



చిలుకూరులో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిలుకూరు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీ రామారావు సూర్యాపేట పర్యటనలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం చిలుకూరులో కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కేటీఆర్ విమర్శించడం తగదన్నారు. కేటీఆర్ మరోసారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాష్ట్రంలో తిరగనియ్యమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పింగ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీలు బజ్జూరి వెంకట్‌రెడ్డి, బొలిశెట్టి నాగేంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి నాగిరెడ్డి, సొందుమియా, కొడారు బాబు, సైదిరెడ్డి, గన్నా అశోక్, రమేష్, నాగయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం– 1 స్పెషల్ క్యాంపులో భాగంగా రెండవ రోజు పాఠశాలల ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగార్జున మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం ఉండవచ్చని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగమణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డిపల్లిలో విద్యార్థుల ర్యాలీ

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఆవరణలో వ్యర్థాలను వేయవద్దని సమీప ఇళ్ల ప్రజలను కోరారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జంపాల ప్రసన్నకుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చిన్న బాలయ్య, ఉపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



గడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

మోతె : ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 26న నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కోరారు. సోమవారం మోతె మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వరి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బానోతు లచ్చీరాం, చర్లపెల్లి మల్లయ్య, బానోతు వెంకన్న, శీలం సతీష్, చెరుకు శ్రీను పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

మునగాల : పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా, మండల కమిటీ సభ్యుడు వీరబోయిన వెంకన్న కోరారు. ఈమేరకు సోమవారం మండలంలోని జగన్నాథపురంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలను కోరారు. వారు మాట్లాడుతూ.. వరి ఎండిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి బూతం వెంకన్న, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ జాన్‌బి, డీవైఎఫ్‌ఐ నాయకులు షేక్ ఖాదర్, గ్రామ మహిళా సభ్యురాలు దొడ్డి సుభద్ర, బెల్లం శ్రీదేవి, కోడి మల్లమ్మ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు ఆరు నెలల గడువు

సూర్యాపేటటౌన్ : వివిధ నేరాల్లో, వాహనాల తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కార్లు తదితర వాహనాలను సంబంధిత యాజమానులు ఆరునెలల లోగా సరైన పత్రాలు సమర్పించి తీసుకెళ్లాలని ఎస్పీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న 120 ద్విచక్ర వాహనాలను సరైన పత్రాలు చూపి యాజమానులు విడిపించుకోవాలని సూచించారు. లేకపోతే కాలం చెల్లిన వాహనాలను పాత సామానుకు, సామర్థ్యం ఉన్న వాటిని వేలంకు పంపుతామని తెలిపారు. వాటి వివరాలను జిల్లా పోలీస్ ఫేస్‌బుక్, ఎక్స్‌లో పొందుపరుస్తామన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మునగాల : మండలంలోని విజయరాఘవపురం గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నలమాద మల్సూర్, గ్రామ శాఖ అధ్యక్షుడు వై.మల్లయ్య, నాయకులు పనస శంకర్, ఎన్.నరేష్, వెంపటి నర్సయ్య, గౌస్, విజయలక్ష్మి, రమేష్, లింగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాలమహానాడు జిల్లా అధ్యక్షురాలు పిట్టల భాగమ్మ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని అల్వాలపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. సభకు ప్రతిఒక్క మాల తరలిరావాలన్నారు. గుజ్జు ఆంజనేయులు, కొమ్ము రమేష్, కందుల శ్రీకాంత్, అరుణ, ఇంద్రజ, వీరబాబు, నాగరాజు, సాయి, లవకుమార్ ఉన్నారు.

గోటితో వలిచి.. బియ్యంగా మార్చి

- శ్రీరామ నవమికి తలంబ్రాలు సిద్ధం చేస్తున్న మహిళలు



ధాన్యాన్ని గోటితో వలుస్తున్న మహిళలు

గరిడేపల్లి : ఏప్రిల్‌లో జరగనున్న శ్రీరామ నవమికి మహిళలు తలంబ్రాల బియ్యాన్ని సిద్ధం చేస్తున్నారు. సోమవారం గరిడేపల్లికి చెందిన మహిళలు ఇంటి వద్ద నుంచి తెచ్చిన ధాన్యాన్ని స్థానిక శివాలయంలో గోటితో వలిచి బియ్యంగా మార్చారు. భక్తి పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

అమరుల త్యాగం వృథా కాదు

నేరేడుచర్ల : దేశం కోసం మరణించిన అమరుల త్యాగం వృథా కాదని, వారి ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు చంద్ర అరుణ అన్నారు. ఆదివారం రాత్రి నేరేడుచర్లలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా నేరేడుచర్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీవైఎల్ నేత వాసా కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హన్మేష్, ఆవుల అశోక్, కొత్తపల్లి రేణుక, వెంకన్న, వాసా పల్లయ్య, వెంకన్న, నర్సయ్య, హుస్సేన్, లక్ష్మయ్య, భిక్షం, లక్ష్మి, పావని, రేష్మా, మౌలాంబి ఉన్నారు.

జరిమానా విధించాలి

హుజూర్‌నగర్ : అనధికారికంగా కరెంటు వినియోగిస్తున్న పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు జరిమానా విధించాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు సోమగాని నరేందర్‌గౌడ్ కోరారు. ఈమేరకు సోమవారం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. బాదే నరసయ్య, ఠాగూర్, లింగం కృష్ణ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాద ప్రదేశాల గుర్తింపు



ప్రమాద ప్రదేశాలను గుర్తిస్తున్న అధికారులు

నేరేడుచర్ల : పట్టణ పరిధిలో కోదాడ– జడ్చర్ల జాతీయ ప్రధాన రహదారిపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను జాతీయ రహదారి జేఈ నవీన్‌కుమార్‌తో కలిసి నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్ సోమవారం గుర్తించారు. ప్రధానంగా చిల్లేపల్లి నుంచి సోమారం వెళ్లే క్రాస్ రోడ్డు, రామగిరి రోడ్డులోని అవని రైస్ మిల్, నేరేడుచర్ల పట్టణ శివారులోని ఎన్‌టీఆర్ కాలనీ, నేరేడుచర్ల ప్రధాన చౌరస్తా వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని హైవే రోడ్డు అధికారులకు ఎస్‌ఐ సూచించారు. వారి వెంట హైవే ప్రాజెక్టు కాంట్రాక్టర్ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం



మునగాల : రేపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగాల : క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరమని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ సూచించారు. సోమవారం ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రేపాలలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. క్షయవ్యాధి తుంపర్లు, గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉంటే సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి బి.భాస్కర్‌రాజు, సూపర్‌వైజర్ బి.జయమ్మ, నర్సింగ్ అధికారి సునీత, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీంద్ర, ఏఎన్ఎంలు బి.పద్మ, కె.పద్మ, నరసమ్మ, ఆశా వర్కర్లు సుధ, జ్యోతి, వెంకటమ్మ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత

హుజూర్‌నగర్‌రూరల్ : క్షయ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత అని మండల వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్ అన్నారు. సోమవారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రివేళలో జ్వరం, బరువు తగ్గడం, కళ్లలో రక్తపు జీరలు కనపడితే వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నూర్జాహాన్, సూపర్‌వైజర్ పద్మ, ఎల్‌టీ రమేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కళాకారులు

మఠంపల్లి : రంగ స్థల కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కళాకారుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోనగిరి ప్రకాష్‌బాబు కోరారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 28న మఠంపల్లిలోని బొడ్రాయి సెంటర్‌లో ఆగ్నేషమ్మ బాలశౌరయ్య కళా నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న బాలనాగమ్మ పౌరాణిక, జానపద, పద్య నాటకం కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు థామస్‌రెడ్డి, బీవీ.రామారావు, సైదులు, షేక్ ఖాసీం, జాలకిరణ్, బొజ్జా సైదులు, జయభారత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపయ్య, జోసు, నాగరాజు, నాగేశ్వరరావు, ధర్మయ్యగౌడ్, నాగబ్రహ్మాచారి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గరిడేపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సరోజ



మునగాల : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

మునగాల : మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన పీహెచ్‌సీ ఎదుట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం గరిడేపల్లి ఎంపీడీఓ సరోజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ములగొండ సీతారాంరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండా నర్సిరెడ్డి, సతీష్, రావుల వెంకన్న, సూదిరెడ్డి నర్సిరెడ్డి, బొంత వెంకట్‌రెడ్డి తదితరు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతికి నిలయం భారతదేశం



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

మునగాల : విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు, కళలకు భారతదేశం నిలయమని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ఆచార, సంప్రదాయాలకు, వారి సంస్కృతి, ప్రాచీన కళలను కళ్లకు కట్టినట్లు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, ఉపాధ్యాయ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కులమతాలకతీతంగా ఇఫ్తార్ విందులు

మునగాల : రంజాన్ మాసంలో కులమతాలకు అతీతంగా హిందువులు ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఓరుగంటి రవి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని బరాఖత్‌గూడెంలో ఆయన తన నివాసంలో పలువురు ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. తొలుత స్థానిక మజీద్ వద్ద ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మునగాలలో..

మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఆర్యవైశ్య ప్రముఖులు నల్లపాటి నాగేశ్వరరావు వంద మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం పది గంటలకు వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు ఆసక్తి గల రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'వేసవిలో పశుగ్రాస పంటలలో పద్ధతులు, పండ్ల తోటల యాజమాన్యం 'అనే అంశంపై శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలు తెలియజేస్తారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్

నడిగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌వెళ్తున్న నడిగూడెం మండలంలోని ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో సైదమ్మ, లక్ష్మి, సునీత, శ్రీలక్ష్మి ఉన్నారు.

హుజూర్‌నగర్ : తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళ్తున్న ఆశా వర్కర్లను సోమవారం పోలీసులు ముందస్తుగాఅరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల అక్షర ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు.

విద్యుత్ డీఈకి సన్మానం

మోతె : మండల పరిధిలోని నామవరం గ్రామంలో సోమవారం జరిగిన యాదవుల ఆరాధ్య దైవం యలమంచమ్మ జాతరలో పాల్గొన్న విద్యుత్ శాఖ హుజూర్‌నగర్ డీఈ నిమ్మ వెంకటకృష్ణయ్యను యాదవులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ముందుగా వెంకటకృష్ణయ్య యలమంచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

నేరేడుచర్ల : పార్టీ ఫిరాయింపుకు పాల్పడుతున్న ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ కీలక నిర్ణయం తీసుకొని వారిని బహిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు కోరారు. సోమవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు లంకెలపల్లి నాగార్జున, లావూడ్య శ్రీనునాయక్, బచ్చలకూరి నాగశేఖర్, రాములు, నాగయ్య ఉన్నారు.